బల్కంపేట్ ఎల్లమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ



గోల్కొండ: దశాబ్దాలుగా వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగిస్తామని గోల్కొండ జగదాంబిక మహంకాళి బోనాల ఉత్సవ నిర్వహణ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు అన్నారు. గోల్కొండ జగదాంబిక మహంకాళి ఆలయం తరఫున శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు బల్కంపేట ఎల్లమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు సంతోష్‌గౌడ్, అనిత, ఆకుల చంద్రశేఖర్ తదితరులున్నారు.

తెలంగాణ సంస్కృతిని చాటేలా బోనాలు



నాంపల్లి: ఆషాఢ మాసం బోనాల అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శ్రీ మహంకాళి దేవాలయ కమిటీ హైదరాబాదు జిల్లా తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల అధ్యక్షుడు వర్కల సత్యనారాయణ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి పూజా నిర్వహించి వేదమంత్రోచ్ఛారణల మధ్య కుంకుమార్చన, అభిషేకం, అర్చనలు, మహిళలు సంప్రదాయంగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళలు ప్రదర్శించిన కోలాట నృత్యం చూపరులను ఆకట్టుకున్నాయి. డప్పువాయిద్యాల హోరులో పోతరాజుల వీరంగం భక్తుల కేరింతలు, భక్తి నినాదాల మధ్య ఊరేగింపు జరిగింది. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించినట్లు వర్కల సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, ప్రమోద్, భిక్షపతి, జాకీర్, వాల్మీకి, రామరాజు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సమీనా బేగం

యాకుత్‌పురా: వర్షా కాలంతో నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కార్పొరేటర్ డాక్టర్ సమీనా బేగం సూచించారు. మజ్లిస్ పార్టీ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో డివిజన్‌లోని తలాబ్‌కట్టా నషేమన్‌నగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యం శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. శిబిరంలో పాల్గొన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ మహమూద్ అలీ, మహ్మద్ అబ్దుల్ కరీమ్, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు

దివ్యాంగులకు అండగా మజ్లిస్



మహ్మద్ జాహెద్‌తో మాట్లాడుతున్న అసదుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: దివ్యాంగులకు మజ్లిస్ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ వికలాంగుల సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ జాహెద్ శుక్రవారం అసదుద్దీన్ ఒవైసీని కలిశారు. రాజీవ్ యువ వికాసం పథకానికి తాను దరఖాస్తు చేసుకున్నానని అయితే అధికారులు ఇప్పటి వరకు తన దరఖాస్తును పట్టించుకోవడం లేదని జాహెద్ అసదుద్దీన్ దృష్టికి తెచ్చారు. కాగా అధికారుల దృష్టికి తెచ్చి రుణం మంజూరైయ్యేలా చూస్తానని అసదుద్దీన్ అన్నారు.

బస్తీ దేవత.. మీరాలంమండి అమ్మవారు

- 1809 నుంచి పూజలందుకుంటున్న మీరాలంమండి అమ్మవారు
- ఇప్పటికే ప్రారంభమైన త్రిశత చండీ మహాయాగం
- 20న అమ్మవారికి బంగారు బోనం



మహంకాళేశ్వర అమ్మవారు



అమ్మవారికి నైవేద్యం సమర్పించే బంగారు బోనం పాత్ర

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో నిజాం కాలం నుంచి భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. బస్తీ ప్రజలు ఇక్కడి అమ్మవారిని 'బస్తీ దేవత'గా పూజిస్తున్నారు. మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో ప్రతి ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు వైభవంగా జరుగుతాయి. 1805లో మీరాలంమండి కూరగాయల మార్కెట్ ఏర్పడిన అనంతరం 1809లో ఇక్కడ అమ్మవారి ఆలయం నిర్మితమైంది. 2016లో ఆలయాన్ని భక్తుల సౌకర్యార్థం పునః నిర్మించారు. బోనాలను పురస్కరించుకుని ఇప్పటికే అమ్మవారి మహాభిషేకం వైభవంగా జరిగింది. ఇక 21 రోజుల పాటు కొనసాగే రుద్ర సహిత త్రిశత చండీ మహాయాగం పూజలు గత నెల 28న ప్రారంభమయ్యాయి.

అప్పట్లో ప్రతి రోజు రంగారెడ్డి జిల్లాలోని గ్రామాల నుంచి..

నిజాం కాలంలో హైదరాబాద్ ప్రజలకు కూరగాయలు సరఫరా చేసే కేంద్రంగా మీరాలంమండి ప్రసిద్ధి చెందింది. రంగారెడ్డి జిల్లాలోని గ్రామీణా ప్రాంతాల నుంచి ప్రతిరోజు రైతులు తమ కూరగాయల పంటలను ఎడ్ల బండ్లపై మీరాలంమండికి తీసుకువచ్చేవారు. రైతులు తమ ఎడ్ల బండ్లను 'బండిఖానా'లో నిలిపేవారు. ఇక్కడే అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేయడం ప్రారంభించారు.

రానురాను ఆషాఢ మాసం బోనాలుగా..

మహంకాళి అమ్మవారి పూజా కార్యక్రమాలు రానురాను ఆషాఢ మాసం బోనాల జాతరగా రూపాంతరం చెందాయి. రైతులు ప్రారంభించిన ఈ పూజా కార్యక్రమాల అనంతరం 1960లో అమ్మవారి విగ్రహా ప్రతిష్ఠాపన చేసిన నుంచి ప్రతి ఆషాఢ మాసం మూడో బుధవారం రోజు అమ్మవారికి బోనం సమర్పించేవారు. అనంతరం ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నారు.

20న అమ్మవారికి బంగారు బోనం..



ఆషాఢ మాసం బోనాల సందర్భంగా 20వ తేదీ నుంచి మీరాలంమండి మహంకాళేశ్వర అమ్మవారికి బంగారు పాత్రలో బోనం సమర్పించనున్నాం. 21న చార్మినార్ ప్రధాన వీధుల్లో నిర్వహించే అమ్మవారి సామూహిక ఘటాల ఊరేగింపులో తమ ఆలయానికి చెందిన అమ్మవారి ఘటాన్ని వైభవంగా సామూహిక ఊరేగింపు నిర్వహిస్తాం. దారిపొడవునా వినూత్న తరహాలో కళాకారులు నిర్వహించే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకోనున్నాయి.

– గాజుల అంజయ్య, ఆలయ కమిటీ చైర్మన్

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి



సురేంద్రమోహన్‌కు మెమోరాండం అందజేస్తున్న ముజీబ్ హుస్సేని, సత్యనారాయణ గౌడ్

అబిడ్స్: వ్యవసాయ మార్కెట్ కమిటీ మహబూబ్‌నగర్ కార్యదర్శి భాస్కర్‌పై దాడిచేసిన వైస్ చైర్మన్ విజయ్‌కుమార్‌ను కఠినంగా శిక్షించాలని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని, కోశాధికారి సత్యనారాయణగౌడ్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ సురేంద్రమోహన్‌కు మెమోరాండం అందజేశారు. అనంతరం ముజీబ్ హుస్సేని, సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. విధుల్లో ఉన్న మహబూబ్‌నగర్ కార్యదర్శి భాస్కర్‌పై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై ఎవరైనా దాడులకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ వెంకటేశం అశోక్ శ్రీనివాస్, శ్రీనివాస్, కేఆర్.రాజ్‌కుమార్, వైదిక్ శాస్త్రీ, శంకర్, అమరేందర్, ముక్రమ్ పాల్గొన్నారు.

రోశయ్యను ఆదర్శంగా తీసుకోవాలి



చాగంటి కోటేశ్వరరావును సన్మానిస్తున్న గడ్డం ప్రసాద్

గన్‌ఫౌండ్రీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కె.రోశయ్యను నేటి రాజకీయ నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించిన రోశయ్య జయంతి వేడుకలో స్పీకర్ పాల్గొని మాట్లాడారు. రాజకీయ జీవితంలో రోశయ్య తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నారన్నారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల్లో అధికారంలోకి రావడం కోసం రాజకీయ పార్టీలు అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారని, ఆ పథకాలే ప్రభుత్వాలు మోయలేనటువంటి ఆర్థికభారంగా మారే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రోశయ్య గొప్ప ఆర్థికవేత్త అని అసెంబ్లీలో ఆర్థిక బిల్లులపై ఆయన అభిప్రాయాన్ని నిర్మోహమాటంగా చెప్పేవారిని ఆయన ప్రసంగాలు మాకు పాఠాలు లాంటివని గుర్తు చేశారు. అనంతరం ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త చాగంటి కోటేశ్వర్‌రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్సీ వి.దయానంద్‌గుప్తా, మేయర్ గద్వాల విజయలక్ష్మీ, మాజీ ఎంపీ కేవీపీ రాంచంద్రరావు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్, కల్వ సుజాత, సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి

చాంద్రాయణగుట్ట: దొడ్డి కొమురయ్య త్యాగం మరువలేనిదని సీపీఎం చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్.కిషన్ అన్నారు. కొమురయ్య వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. అణచివేతలే తిరుగుబాటుకు పురుడు పోస్తాయనడానికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఒక నిదర్శనమన్నారు. నిజాం నిరంకుశ పాలన, భూస్వాముల అణచివేత, అరాచకాలు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా చేసిన తిరుగుబాటు చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాంకుమార్, వీరన్న, సోమన్న, సుజాత, బాలు, హీర, దేవ్‌సింగ్ పాల్గొన్నారు.



దొడ్డి కొమురయ్య చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

అభివృద్ధి పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న పర్వతాల రాజేందర్

చాంద్రాయణగుట్ట: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయాల వద్ద అభివృద్ధి పనులు చేయడం హర్షణీయమని టీపీసీసీ కార్య నిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ అన్నారు. జంగమ్మెట్‌లోని బుడగ జంగాల బస్తీలో పవర్ బోర్, ఫ్లోరింగ్ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాతబస్తీలో అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రవి, చెన్నయ్య, ప్రసాద్, శివకుమార్, సాయికుమార్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం న్నికలు

గౌలిపురా: శాలిబండ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించి ఫలితాలను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన హరి నారాయణ ప్రకటించారు. హెడ్ గర్ల్‌గా కె.మంజు, స్పోర్ట్స్ సెక్రటరీగా హారిక, సాంస్కృతిక కార్యదర్శిగా కె.మాధురి, క్రమశిక్షణ కమిటీ ఆర్.సంగీత విజయం సాధించారు. ఈ ఎన్నికల పర్యవేక్షకులుగా మధుసూదన్‌రావు, అనిరుద్ధారావు, డాక్టర్ ఎస్.విజయ భాస్కర్, సంధ్య, మంజుల, శ్రీదేవి, ప్రేమిల, నవనీత, శివ ప్రసాద్, రవికాంత్, పాఠశాల జూనియర్ అసిస్టెంట్‌లు అనిల్ కుమార్, సుదేష్ణ, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎన్నికల పర్యవేక్షకులుగా పాఠశాల ఉపాధ్యాయులు వ్యవహరించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు.

- 11కేవీ బృందావన్ కాలనీ, ప్యాప్సి ఫీడర్ల పరిధిలో. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..
- మిని బృందావన్ కాలనీ, విరాట్ నగర్, హకీంశా కుంట, ఆదిత్య టవర్స్, రామాలయం, మైనార్టీ హాస్టల్, క్రిమినల్ కిర్టు వీది, దేవ్‌బాగ్, ప్యాప్సి బిల్డింగ్, జంగం బస్తి, రెడ్ హిల్స్, లకిడికాపూల్, పూల్ ప్రాంతాలు.

11కేవీ హకీంషా, పియరల్ రెజెన్సీ ఫీడర్ల పరిధిలో..

- మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు
- హకీంషాకుంట, బృందావన్ కాలనీ, చోటా జానకీ నగర్, బడా జానకీ నగర్, డిలక్స్ కాలనీ, పారమౌంట్ గేట్ నెంబర్-1, లకిడికాపూల్, ప్యాప్సి , బజార్‌ఘట్, ప్రగతి ప్రెస్ పరిసర ప్రాంతాలు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

లంగర్‌హౌస్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటరాములు వివరాల ప్రకారం..అత్తాపూర్ నుంచి బాపూఘాట్ బ్రిడ్జికి వచ్చే దారిలో మూసీలోకి వెళ్లే చిన్న కాలువ చీలికలో ఓ వ్యక్తి పడి ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందిఉన్నట్లు నిర్ధారించారు. రాత్రి సమయంలో మద్యంమత్తులో అటు వెళ్తూ కాలుజారి పడి మృతిచెందాడని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్టు అనంతరం ఎలా జారిగిందని నిర్ధారించగలమని పోలీసులు తెలిపారు.

పీర్ల ఊరేగింపులో ఘర్షణ

పలువురికి గాయాలు

నాంపల్లి: పీర్ల ఊరేగింపులో తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసిన ఘటన హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. యూసుఫియన్ దర్గా సమీపంలోని జనాన గేటు సమీపంలో పీర్లను ప్రతిష్ఠించారు. గురువారం రాత్రి నిర్వహించిన ఊరేగింపులో జరిగిన ఘర్షణలో ఆసిఫ్, మగ్బూల్, మసూద్, రియాన్, ఖలేద్, ఖమర్, అస్లర్ గాయపడ్డారు. గాయపడ్డ వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు బాధితులు పోలీసులను ఆశ్రయించి దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. మాస్, అక్బర్, మజర్, అబ్బు క్రిష్ తమపై దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నోట్‌బుక్స్, స్టేషనరీ పంపిణీ

అబిడ్స్: గోషామహల్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో వాసవిక్లబ్ కేజీఎఫ్ బుద్ధపూర్ణిమ సంస్థ, అదే పాఠశాల పూర్వ విద్యార్థుల సహకారంతో విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరి అందజేశారు. శుక్రవారం పాఠశాల పూర్వ విద్యార్థులైన బేగంబజార్ కార్పొరేటర్ శంకర్ యాదవ్, చైతన్యపురి కార్పొరేటర్ రంగ నర్సింహా గుప్తా పాల్గొని పంపిణీ చేసి మాట్లాడారు. ఇదే పాఠశాలలో చదివి అతిథులుగా రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి జీవితాంతం కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు రమేష్ అమరాడి విరాళంగా అందించిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. స్టేషనరి కోసం సహకరించిన వాసు మెడికల్ గ్రూప్స్ అధినేత బెజిగం వాసును అభినందించారు. ఈ కార్యక్రమంలో అశోక్ కుమార్, చంద్రశేఖర్, లఘుకుమార్, మురళిగుప్తా, హెడ్‌మాస్టర్ విజయలక్ష్మీ, ఇన్‌చార్జ్ శ్రీమన్నారాయణ, సురేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్‌బుక్స్, స్టేషనరి పంపిణీ చేస్తున్న కార్పొరేటర్లు

సామూహిక కుంకుమార్చన



సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

యాకుత్‌పురా: బోనాల ఉత్సవాల్లో భాగంగా హరిబౌలీ అక్కన్నమాదన్న మహంకాళి ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఉదయం 11 గంటలకు నిర్వహించిన కుంకుమార్చనలో స్థానిక ప్రాంతాలకు చెందిన 400 మంది మహిళలు పాల్గొన్ని అమ్మవారికి అర్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు డి.ప్రభాకర్, ప్రతినిధులు రాజారత్నం, ఏ.సతీష్, ఎస్.పి క్రాంతి కుమార్, జగ్మోహన్ కపూర్, ఎం.కృష్ణ, ఎం.వినోద్, జోగేందర్, శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

ప్రభాకర్ జైనీకి సత్కారం



ప్రభాకర్ జైనీ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

నాంపల్లి: తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ పీజీ డిప్లొమా ఇన్ ఫిలిం డైరెక్షన్ కోర్సు విద్యార్థి, ప్రముఖ సినీ దర్శకుడు ప్రభాకర్ జైనీకి శుక్రవారం నాంపల్లిలోని తెలుగు వర్సిటీ సమావేశ మందిరంలో అభినందన సత్కార సభ జరిగింది. తెలుగు వర్సిటీ రంగస్థల కళల శాఖ ఆధ్వర్యంలో జరిగిన సభకు సీఎం ఓఎస్‌డి వేముల శ్రీనివాసులు హాజరై తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు, సినీ రచయిత కె.ఎల్.ప్రసాద్‌తో కలిసి ప్రభాకర్ జైనీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు వర్సిటీ రంగస్థల కళల శాఖ పీఠాధిపతి బీహెచ్ పద్మప్రియ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆంటోనీ రాజ్, విస్తరణల సేవా విభాగం ఇన్‌చార్జి రింగు రామ్మూర్తి, తెలుగు వర్సిటీ ప్రజా సంబంధాల శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బీఎస్.రాంబాబు

సుల్తాన్‌బజార్: కేంద్ర కార్మిక సంఘాల, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాల ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బీఎస్.రాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం కోఠిలోని ఏఐబీఈఏ రాష్ట్ర కార్యాలయంలో యునైటెడ్ ఫోరం ఆఫ్ పబ్లిక్ సెక్టార్ యూనియన్స్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. పబ్లిక్ సెక్టార్ యూనియన్స్ కో ఆర్డినేటర్ వీఎస్.బోస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బీఎస్.రాంబాబు, యూఎఫ్‌పీయూ కన్వీనర్ ఎన్‌వి.రమణ, ఏఐపీఆర్‌డీఏ రాష్ట్ర కార్యదర్శి ఎండీ.జలాలుద్దీన్, ఎం.శివశంకర్ (జీఐజీఏఐఏ,తెలంగాణ) బి.నర్సిములు (పోస్టల్‌యూనియన్ తెలంగాణ), పి.అజయ్‌కుమార్, పి.ఉదయ్ భాస్కర్, (డీజీఎస్, ఎపీటీబిఈఎఫ్)లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ..నూతన ఆర్థిక విధాల పేరుతో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలైన బ్యాంక్‌లు, ఇన్సూరెన్స్ రంగాలను ప్రైవేట్‌పరం చేసేందుకు ఈ రంగాలను నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి ఎంఎస్ఎం ఈ రంగాలకు బ్యాంకు రుణాలు రోజు రోజుకు తగ్గిపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులతో ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ సైదులు

గోల్కొండ: పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని టోలిచౌకీ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, గోల్కొండ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులతో కలిసి గోల్కొండ బాలాహిస్సార్, బడాబజార్, రిసాలబజార్, మోతీదర్వాజా తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఉన్న ఆషూర్‌ఖానాల నిర్వాహకులతో ఆయన మాట్లాడారు. బోనాల ఉత్సవాలు, మొహర్రం ఒకేసారి కలిసి రావడం నగర ప్రజలకు దేవుడు ఇచ్చిన వరం అన్నారు. ఇటువంటి సందర్భాల్లో వివిధ వర్గాల ప్రజల మధ్య ఉన్న స్నేహ సంబంధాలు మరింత పటిష్టంగా ఎదుగుతాయన్నారు. ప్రస్తుతం పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీలను పటిష్టపరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఐ రాజేంద్రప్రసాద్, ఎస్సై రఫీయుద్దీన్, పీస్ కమిటీ ప్రతినిధులు ఆబేద్, ఇలియాస్ అలీ, ఆఫీస్, నర్సింగ్, సంతోష్ తదితరులున్నారు.

కార్వాన్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలి



టోలిచౌకీలో పర్యటిస్తున్న టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ ముషరఫ్ ఫారూఖీ, ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్‌లో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషరఫ్ ఫారూఖీతో కలిసి తాళ్లగడ్డ, జియాగూడ, తపాచాబుత్ర, కార్వాన్, ఎండీలైన్స్, శాతం చెరువు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో 33 కేవీ సబ్‌స్టేషన్‌లను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..సబ్‌స్టేషన్‌లను ఆధునీకరించి వీటితో పాటు కొత్త 33 కేవీ సబ్‌స్టేషన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 102, ఎండిలైన్స్ తదితర ప్రాంతాల్లో ఉన్న 33 కేవీ సబ్‌స్టేషన్‌లను ఇతర ప్రాంతాలకు మార్చాలని ఆయన కోరారు. ముషరాఫ్ ఫారూఖీ మాట్లాడుతూ.. తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు మార్పులు చేస్తున్నామన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కట్టా మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న నూతన కార్యవర్గం

నాంపల్లి: అఫ్జల్‌సాగర్ కట్టా మైసమ్మ ఆలయ నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. కమిటీ చైర్మన్‌గా ఎస్.రవిప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా ఎం.నందుకుమార్, వైస్ చైర్మన్లుగా వై.పరమేష్, బి.నర్సింగ్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా ఎం.చంద్రశేఖర్, కె.శివప్రసాద్, కె.అర్జున్, టి.అరవింద్, కోశాధికారిగా ఎం.ముఖేష్‌కుమార్, ఉప కోశాధికారిగా ఇ.కిరణ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా టి.శరణ్‌కుమార్, ఇ.ఎస్.సునీల్, బి.శివకుమార్, కె.సురేష్, జె.ధరమ్ సింగ్, బి.జయంత్, జె.ఆదిత్య, సలహాదారులుగా కె.నర్సింగ్‌రావు, కొరమన్ నర్సింగ్‌రావు,జె.సత్యనారాయణ, ఎస్.నర్సింగ్, బి.స్వామిలాల్ ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం మూడేళ్ల పాటు కొనసాగుతుంది. నూతన కార్యవర్గానికి డీ–క్లాస్ బస్తీ నేత మనోహర్ అభినందనలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మ తల్లికి బంగారు బోనం



బంగారు బోనంతో జోగిని అవిక

చార్మినార్: భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి బంగారు పాత్రలోని నైవేద్యంతో పాటు పట్టు వస్త్రాలు, ఒడి బియ్యం సమర్పించారు. ఇప్పటికే మొదటి బోనంను గొల్కొండ జగదాంబ అమ్మవారికి, రెండో బోనాన్ని విజయవాడ కనక దుర్గమ్మ తల్లికి..మూడో బోనాన్ని బల్కంపేట ఎల్లమ్మ తల్లికి సమర్పించారు. పోతరాజుల నృత్యాలు,కళాకారుల ప్రదర్శనలతో సామూహిక ఊరేగింపుగా బయలుదేరి అమ్మవార్లకు బంగారు బోనాన్ని సమర్పిస్తున్నారు. ఇక నాలుగో బంగారు బోనాన్ని శుక్రవారం ఉదయం పాతబస్తీ హరిబౌలిలోని అక్కన్న మాదన్న దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పెద్దమ్మ గుడికి బయలు దేరారు. జోగిని అవిక బంగారు పాత్రలోని నైవేద్యాన్ని తలపై పెట్టుకుని పాతబస్తీ హరిబౌలిలోని దారిపొడవునా నత్యాలు చేస్తూ భక్తులను అలరించారు.